MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 245 | గురువారం 26 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

## రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే

# తోక కట్ చేస్తాం



- గంజాయి ఎవరూ వాడినా వదిలిపెట్టం
- లా అండ్ ఆర్డర్‌లో చాలా సమస్యలు చూశాం
- రాయలసీమలో ముఠాలను అణచివేసిన పార్టీ టీడీపీ
- రాబోయే రోజుల్లో ముఠా కక్షలు ఉండటానికి వీల్లేదు
- ఈగల్ పేరుతో గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా డేగకన్ను వేశాం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి గుంటూరు**

రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడితే ఊరుకోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు హెచ్చరించారు. రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తానని వార్నింగ్ ఇచ్చారు. గురువారం గుంటూరులో యాంటీ నార్కొటిక్స్ డేలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. గంజాయి సాగుతో దేశాన్ని, ఏపీని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ బ్రాండ్‌ను గత పాలకులు నాశనం చేశారని ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నానని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు. అడ్డొస్తే తొక్కుకుంటూ వెళ్తాం.. వదిలిపెట్టమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గంజాయి ఎవరూ వాడినా వదిలిపెట్టమని.. లా అండ్ ఆర్డర్‌లో చాలా సమస్యలు చూశానని తెలిపారు. రాయలసీమలో ముఠాలను అణచివేసిన పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ముఠా కక్షలు ఉండటానికి వీల్లేదని అన్నారు. మారితే మారండి.. మారకపోతే ఏపీలో ఉండే - మిగతా3లో

## టీటీడీ ఉద్యోగులకు 2వేల హెల్మెట్లు పంపిణీ

**అంకుశం న్యూస్ తిరుమల జూన్ 26**

టీటీడీ ఉద్యోగులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సీవీఎస్వో మురళీకృష్ణ తో కలిసి గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇటీవలే 500 హెల్మెట్లు పంపిణీ చేశామని, అమలాపురానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ, హైదరాబాద్ కు చెందిన శ్రీ నాగేంద్ర ప్రసాద్ అనే దాతలు విరాళంగా ఇచ్చిన 2 వేల హెల్మెట్లు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరో 7500 హెల్మెట్లు టీటీడీ ఉద్యోగులకు అందిస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని ఆయన కోరారు. టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు అందిస్తున్న హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. హెల్మెట్లు ధరించడంపై అలిపిరి, ఘాట్ రోడ్ల వద్ద ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నామని తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం తిరుమలకు వచ్చే



భక్తులందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో శ్రీమతి సదా లక్ష్మీ, అన్న ప్రసాదం స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాబూ.. 9,000 కోట్ల అప్పు కోసం..

# 1,91,000 కోట్ల గనుల తాకట్టు



- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్
- 'చంద్రబాబు ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు
- చంద్రబాబు సర్కార్ అడ్డగోలుగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది
- ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు
- రూ. 5,526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారు

**తాడేపల్లి**

ఏపీలో చంద్రబాబు సర్కార్ మరోసారి రాజ్యాం గాన్ని ఉల్లంఘిస్తూ అప్పులు చేయడంపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. చంద్రబాబు ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు.. 5,526 కోట్లను బాం డ్ల జారీ ద్వారా అప్పులు చేశారని తెలిపారు. ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చంద్రబాబు చెప్పాలి? అని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ - మిగతా3లో



## ఏపీలో హార్బర్లు, పోర్ట్‌ల నిర్మాణంపై

# ప్రత్యేక దృష్టి

- భోగాపురం విమానాశ్రయం పనులు 78శాతం పూర్తయ్యాయి
- ప్రతి 50 కిలోమీటర్లకు షిప్పింగ్ బోట్లు ఏర్పాటు చేశామని వెల్లడి
- రూ.595 కోట్లతో విజయవాడ విమానాశ్రయాన్ని కూడా అన్నిస్థాయిల్లో అభివృద్ధి చేస్తాం

## మోదీ విజన్, చంద్రబాబు ప్లానింగ్‌తో ఏపీ అభివృద్ధి

**విజయవాడ**



ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్లానింగ్‌తో ఏపీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉద్ఘాటించారు. గత ఏడాది కాలంగా రూ.450 కోట్లను వివిధ ప్రాజెక్ట్‌ల కింద ఖర్చు చేశామని వెల్లడించారు. టూరిజం శాఖ తరపున ఏడు ప్రాజెక్ట్‌లకు ఈ నిధులు వెచ్చించా మని తెలిపారు. గురువారం రాజమండ్రిలో కేంద్రమంత్రి - మిగతా3లో

## విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ జూలై 5న రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిపిఐ పిలుపు.

**అంకుశం న్యూస్ విజయవాడ జూన్ 26**

పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ జులై 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం పిలుపునిచ్చినట్లు సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగలగొట్టాలని సూచించారు. ఆదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకివస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని, అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కాని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన ఏడాది కాలంలో 4 సార్లు విద్యుత్ భారాలను వినియోగదారులపై మోపారు. గృహ వినియోగాలకు సంబంధించి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల 25 ఏళ్లపాటు దాదాపు ఒక లక్ష పదివేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుంది. ఈ ఒప్పందాలపై కూటమి ప్రభుత్వం కనీసం సమీక్షగాని, కనీసం నోరు మెదపడంగానీ చేయడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల - మిగతా2లో



# ఇంటింటికి తొలి అడుగు

-మొదటిపేజీ తరువాయి

వేల రూపాయలను ఒక్కొక్కరికి ఇవ్వడంతో పాటు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి మహిళల ఉచిత బస్సు అమలు చేస్తామని చెప్పడం వంటివి చేయాలని చంద్రబాబు ఎమ్మెల్యేలకు, ప్రజప్రతినిధులకు చెప్పారు. జులై ఒకటో తేదీ నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి క్షేత్రస్థాయిలో నివేదికలను చంద్రబాబు తెప్పించుకుని ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తారట. ఉచిత ఇసుక, మద్యం వంటి విషయాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఆరోపణలు ఎదుర్కొనడంతో వారిని కూడా జనం వద్దకు పంపాలన్నది చంద్రబాబు ప్రయత్నం. గత ఏడాది నుంచి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా నియోజకవర్గం పరంగా ఏమి మంచి జరిగిందో జనాలకు వివరించి వారిలో ఏదైనా అసంతృప్తి ఉంటే దానిని తొలగించే ప్రయత్నం చేయాలని చంద్రబాబు ఆలోచన. అయితే జనం నుంచి ఎలాంటి స్పందన వస్తుందన్నది ఎమ్మెల్యేలకు అంతుచిక్కడం లేదు.. చంద్రబాబు చేయించిన సర్వేల్లో ప్రభుత్వంపై సానుకూలత ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల్లో ఎక్కువగా అసంతృప్తి ఉందని తేలింది. అందులో కొత్తగా ఎన్నికైన దాదాపు ఎనభై మంది ఎమ్మెల్యేల్లో అధిక శాతం కూడా ఉండటంతో వారిని ప్రజలతో మమేకం చేయాలని చంద్రబాబు ఈ కార్యక్రమాన్నితలపెట్టినట్లు కనపడుతుంది. దీంతో పాటు క్యాడర్ ను కూడా కలుపుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనగలిగితే ఎమ్మెల్యేలకు, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ కూడా తొలగిపోతుందని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు హడావిడి కాకుండా నాలుగేళ్ల ముందు నుంచే చర్యలు తీసుకోవడంతో పాటు కార్యకర్తలను కూడా మోటివేట్ చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా కనిపిస్తుంది. మరి ఈ కార్యక్రమం ఏ మేరకు సక్సెస్ అవుతుందన్నది చూడాల్సి ఉంది.

# 5 వేల ఎకరాల్లో..ఏపీలో కొత్త ఎయిర్‌పోర్టు.

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అమరావితి అంతర్జాతీయ స్థా?యి నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అమరావతిలో మౌలిక వసతుల ప్రాజెక్టులకు పెద్ద పీట వేస్తోంది. అమరావతిని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అలాగే స్పోర్ట్స్ సిటీ, అమరావతిలోక్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలను చేపట్టనుంది. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. అమరావతి కోసం అదనంగా భూమిని సమీకరించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి అదనపు భూసమీకరణకు ఏపీ కేబినెట్ కూడా


గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.లో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక విషయాలు వెల్లడించారు. అమరావతిలో అదనపు భూ సమీకరణకు జులై నెలాఖరులో సీఆర్డీఏ నోటిఫికేషన్ ఇస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు. అలాగే అదనపు భూ సమీకరణకు 2015 నాటి నిబంధనలే అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అమరావతిలో 5000 ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించనున్నారు. అలాగే 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, మరో 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం 10 వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు.మరోవైపు అమరావతి భవిష్యత్తు అవసరాల కోసం అదనంగా 45 వేల ఎకరాలు సమీకరించనున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాజధాని కోసం



భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాల్సి ఉంటుందన్న ఆయన.. ఈ నేపథ్యంలో ఎక్కువ భూమి అవసరమవుతోందన్నారు. మరోవైపు అమరావతిలో అనేక సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తోంది.రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో పలు కంపెనీలకు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అమరావతిలో భూములు కేటాయిస్తోంది. ఇప్పటి వరకూ సుమారుగా 74 సంస్థలకు అమరావతిలో భూములు కేటాయించారు. మూడేళ్లలోగా అమరావతి నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# పవన్ 2.0 ఎలా ఉంటుంది

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో పొలిటికల్ హీట్ మళ్లీ పొగలు సెగలుగక్కుతోందా అంటే?.. పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు సభ జరిగింది. ఈ సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగం చుట్టూ ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. తేడా చేస్తే? తొక్కి నార తీస్తామన్న డిప్యూటీ సీఎం మాటల్ని గుర్తు చేస్తూ?. పవన్ మళ్ళీ అఫెన్సివ్ మోడ్‌లోకి వచ్చారా అంటూ చర్చించుకుంటున్నాయి రాజకీయవర్గాలు. వైసీపీ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారాయన. పోలీసులపై ఒత్తిడి తెస్తోందని, ఇలాంటి పరిస్థితిని సహించే ప్రసక్తే లేదని క్లారిటీగా చెప్పేశారు పవన్. గొంతులు కోస్తాం? అన్న బెదిరింపులు పిచ్చి ధోరణి అంటూ తీవ్రంగా స్పందించారాయన. అలాంటి అసాంఘిక వ్యాఖ్యలకు భయపడేది లేదని, శాంతిభద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఇప్పుడీ వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తున్న విశ్లేషకులు..ఏడాది తర్వాత పవన్ తీరు మారిందని చెప్పుకొస్తున్నారు. గడిచిన ఏడాది కాలంగా?. పాలన మీద, షూటింగ్స్‌పై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం? ఇకనుంచి రాజకీయంగా విపక్షం మీద విరుచుకుపడేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోందని అంటున్నారు. సుపరిపాలనలో ఈ దిశగా సంకేతాలిచ్చినట్టు అంచనా వేస్తున్నారు పరిశీలకులు. ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళడమేకాకుండా? వైసీపీ ఆరోపణలకు దీటైన కౌంటర్స్ ఇచ్చే దిశగా పవన్ వ్యూహం సిద్ధం చేసుకున్నట్టు కనిపిస్తోందని అంటున్నారు. సభలో ఉప ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గమనిస్తే? ఈ విషయం క్లియర్‌గా అర్థమవుతోందని అంటున్నారు.పవన్ వ్యాఖ్యల ప్రకారం? గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, అవినీతి వ్యవహారాలను విస్తృతంగా ప్రస్తావించి ఇప్పుడు ప్రజలకు వివరించాల్సిన సమయం వచ్చింది. ఇక సైలెంట్‌గా ఉంటే లాభం లేదని, వైసీపీ తిమ్మిని బమ్మిని చేసే ప్రయత్నంలో ఉందని భావిస్తున్నారట పవన్. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, నిజాలను ప్రజల ముందుంచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పవన్ అభిప్రాయపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఓవైపు పరిపాలన విషయంలో వేగంగా అడుగులు వేస్తుంటే?.దానికి తోడుగా పవన్ కూడా రాజకీయంగా వ్యూహాత్మక దూకుడు పెంచాలని నిర్ణయించుకున్నట్లు అంచనా వేస్తున్నారు



పొలిటికల్ పండిట్స్. ప్రజా వేదికలపై ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతూ? ఆల్‌రౌండర్ పాత్ర పోషించేందుకు పవన్‌కళ్యాణ్ సిద్ధమైనట్టు చెప్పుకుంటున్నారు. ప్రజలకు మంచి చేయాలంటే? నిజాలను చెప్పాలి, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు బహిర్గతం చేయాలన్నది డిప్యూటీ సీఎం ప్లాన్ అట. వాస్తవాల మీద నిర్మితమైన పాలన జరిగితేనే ప్రజలకు నమ్మకం పెరుగుతుందని సభలో అన్నారు పవన్ కళ్యాణ్. ఈ మాటలు కేవలం ఆయన వైఖరిని తెలియజేయడమే కాకుండా, ప్రతిపక్షాలపై స్పందించే కొత్త దిశను సూచిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అటు వైసీపీ ప్రభుత్వ కాలంలో జరిగిన రకరకాల అవకతవకలపై దర్యాప్తు వేగం పెరుగుతోంది. వాటి సారాంశాన్ని రాజకీయ పరంగా ప్రజలలోకి తీసుకెళ్లే బాధ్యతను పవన్ స్వయంగా తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ఇందులో భాగంగా? రాబోయే రోజుల్లో ప్రెస్‌మీట్లు, పబ్లిక్ మీటింగ్స్ పెట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ దిశగా జనసేన కార్యకర్తలకు కూడా సందేశాలు వెళ్ళబోతున్నాయట. మొత్తంగా సుపరిపాలన సభలో? పవన్ తన కొత్త రోల్ గురించి క్లియర్‌గా చెప్పినట్టే కనిపిస్తోందని అంటున్నారు పొలిటికల్ పరిశీలకులు.

# కనిపించని కోనసీమ లీడర్లు...

**కాకినాడ :** అమలాపురం ఎమ్మెల్యేగా గెలిచి వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విశ్వరూప్..అప్పుడు కీలకంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మాత్రం ఆయన పార్టీ యాక్టివిటీకి దూరంగా ఉంటున్నారట. ప్రజా సమస్యల మాట అటు ఉంచితే క్యాడర్ కష్టసుఖాలను కూడా పట్టించుకోవడం లేదట. ఇదే జిల్లా నుంచి అప్పట్లో వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా చేసిన అప్పటి ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రస్తుతం సైలెంట్‌గా ఉంటూ ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ కార్యక్రమాలను కూడా గాలికి వదిలేయడంతో ముమ్మిడివరం నియోజకవర్గంలో వైసీపీ యాక్టివిటీ లేకుండా పోయిందటఇక వైసీపీ రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్న రామచంద్రపురానికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్.. గత ఎన్నికల్లో తన తనయుడు పిల్లి సూర్య ప్రకాశ్‌కు టికెట్ ఇప్పించుకుని గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. కానీ కూటమి గాలికి ఓటమి తప్పలేదు. ఎంపీ బోస్ మాత్రం రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ కార్యక్రమంలో నేనున్నానని చెప్పుకునే విధంగా తన కొడుకుతో పాటు కనిపిస్తున్నారు. కేవలం నియోజకవర్గానికి మాత్రమే పరిమితమయ్యారు. ఇక ఇదే జిల్లా నుంచి ఎమ్మెల్సీగా అవకాశం దక్కించుకున్న మరొక నేత తోట త్రిమూర్తులు. మండపేట నియోజవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన ఆయన ఏడాదిగా తన నియోజకవర్గం వరకు అరకొరగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారట. అయితే తోట త్రిమూర్తులు పెద్దగా యాక్టీవ్‌గా కనిపించడం లేదని క్యాడర్ అసంతృప్తిగా ఉన్నారట.గత ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా చేసి ఇప్పుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి. ఇటీవల కాలంలో జిల్లా అధ్యక్షుడిగా పదవి ఇచ్చినప్పటికీ అది హోదాగానే ఫీల్ అవుతున్నారట ఆయన. పార్టీ కార్యక్రమాలు కానీ..ప్రజా సమస్యలపై పోరులో దూకుడు చూపించడం లేదంటున్నారు క్యాడర్.ఇక పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గం వైసీపీ పరిస్థితి చెప్పనవసరమే లేదు. అసలు ఆ లీడర్లు ఎక్కడున్నారో కూడా ఎవరికీ తెలియదు. నేతలు ఎవరికి వారు బిజీ అయిపోవడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైసీపీ క్యాడర్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందట. కార్యకర్తలకు భరోసా ఇచ్చే నేత లేకపోవడంతో కార్యకర్తలు అయోమయంలో ఉన్నారట. ఇప్పటికైనా అంబేద్కర్ కోనసీమ జిల్లాపై పార్టీ అధినేత జగన్ స్పెషల్ ఫోకస్ పెట్టాలని కోరుతున్నారట క్యాడర్. జిల్లాలో రాబోయే రోజుల్లో వైసీపీ యాక్టివిటీ స్పీడప్ అవుతుందో

## విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ జూలై 5న రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిపిఐ పిలుపు.

-మొదటిపేజీ తరువాయి

భారం ప్రజలపై మోపింది. అంతేగాక గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి విద్యుత్ చార్జీల భారాలను మోపటం ప్రజలను దారుణంగా మోసగించడమే. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి. అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని నిన్న (బుధవారం) విజయవాడలో జరిగిన సిపిఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ప్రజలపై విద్యుత్ పెను భారాలను వ్యతిరేకిస్తూ జులై 5న రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిపిఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. అన్ని జిల్లాల్లో జరిగే ఈ నిరసనలలో అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా సిపిఐ కోరుతున్నది.

## బాబూ.. 9,000 కోట్ల అప్పు కోసం.. 1,91,000 కోట్ల గనుల తాకట్టు

-మొదటిపేజీ తరువాయి

వేదికగా.. 'చంద్రబాబు ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు. చంద్రబాబు సర్కార్ అడ్డగోలుగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ నిన్న కూడా బాండ్లు జారీ చేశారు. రూ. 5,526 కోట్లను బాండ్ల జారీ ద్వారా అప్పులు చేశారు. గతంలోనే ఈ రాజ్యాంగ ఉల్లంఘనపై హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ ఏపీఎండీసీ ద్వారా మళ్ళీ అప్పులు చేశారు. రానున్న రోజుల్లో మళ్ళీ మళ్ళీ ఏపీఎండీసీ ద్వారా అప్పులు చేయటానికి సిద్దమయ్యారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రైవేటు వ్యక్తులు నేరుగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు డ్రా చేయటానికి వీల్లేదు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు పార్టీలే నేరుగా నిధులు డ్రా చేసుకునేలా అవకాశం కల్పించింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. రూ.9000 కోట్ల అప్పుల కోసం ఏపీఎండీసీకి చెందిన రూ. 1,91,000 కోట్ల విలువైన గనులను తాకట్టు పెట్టటం దారుణం. అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావటం ద్వారా %ఖ్రావీణజ%పై సంవత్సరానికి రూ.235 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తుందో చంద్రబాబు చెప్పాలి?. మా హయాంలో ఐదేళ్లలో చేసిన అప్పుల్లో సగం చంద్రబాబు ఈ ఒక్క? ఏడాదిలోనే చేశారు' అని చెప్పుకొచ్చారు.

## రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

అర్హత లేదని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గంజాయి నిర్మూలన బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదు.. ప్రతిపక్షాలు కూడా ముందుకువచ్చి ప్రజల్లో చైతన్యం తేవాలని సీఎం చంద్రబాబు కోరారు. చైతన్యం తెచ్చి ఓట్లు కోరాలి తప్ప రాజకీయ లబ్ధి పొందుతామంటే కుదరదని తేల్చిచెప్పారు. ఈగల్ పేరుతో గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా డేగకన్ను వేశామని చెప్పుకొచ్చారు. 26 జిల్లాల్లో నార్కొటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈగల్ సెల్స్, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, స్కూళ్లలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు సీఎం చంద్రబాబు. మద్యం ఆదాయంలో రెండు శాతాన్ని గంజాయి నిర్మూలనకు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మేవారి ఆస్తులు కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయిపై పోరాడితే టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని గుర్తుచేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సినీ సెలబ్రిటీలు ముందుకురావాలని కోరారు. గంజాయి వేరే ప్రాంతాలనుంచి తీసుకువచ్చి ఏపీలో అమ్మినా వదిలేది లేదని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు.

## ఏపీలో హార్బర్లు, పోర్ట్‌ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హార్బర్లు, పోర్ట్‌ల నిర్మాణంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏడాది కాలంలో వీటిని పూర్తి చేసి ప్రారంభించే విధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఫేజ్ టూ కింద మరో నాలుగు ఫిషింగ్ హార్బర్లలో కూడా నిర్మాణ పనులు చేపడతామని వివరించారు. 950 కిలోమీటర్ల తీర ప్రాంతంలో.. ప్రతి 50 కిలోమీటర్లకు షిప్పింగ్ బోట్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గురువారం ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ అథారిటీ ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్. శివప్రసాద్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం పనులు 78శాతం పూర్తయ్యాయని.. ఈ ఏడాదిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రకటించారు. రూ.595 కోట్లతో విజయవాడ విమానాశ్రయాన్ని కూడా అన్నిస్థాయిల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. త్వరలోనే నూతన నిర్మాణాలను, భవనాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. విజయవాడ, కడప, తిరుపతి, కుప్పం విమానాశ్రయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. భూసేకరణ ఇతర సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌లను ఆదేశించామని అన్నారు. అమరావతిలో అతిపెద్ద విమానాశ్రయం నిర్మాణానికి అధ్యయనం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మూడేళ్లలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నామని తెలిపారు. కేంద్రప్రభుత్వ సాయంతో ఏపీ ఫైబర్ నెట్‌ని పూర్తిగా పునరుద్ధరిస్తామని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్ట్‌లను తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. 978 కిలోమీటర్ల జాతీయ జలమార్గాలు, 57 నదులతో భారతదేశంలో అత్యంత జలసంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ ఉండటం మనకు గర్వకారణమని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీలో ఉన్న లోతట్టు జలమార్గాల ద్వారా సంవత్సరానికి 8 మిలియన్ టన్నుల సరుకును తరలిస్తున్నామని వెల్లడించారు. కడప, ముక్త్యాల, జగ్గయ్యపేటలలో సిమెంట్, విద్యుత్ ప్లాంట్లకు వ్యూహాత్మక అనుసంధానాలతో, మనం దీనిని ఏటా 14 మిలియన్ టన్నులకు పెంచడం, రహదారులపై ఒత్తిడిని తగ్గించడం, లాజిస్టిక్‌ల ఖర్చు తగ్గిస్తోందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ అసలైన మల్టీమోడల్ కారిడార్‌లను అభివృద్ధి చేస్తోందని అన్నారు. పరిశ్రమలకు లోతట్టు ప్రాంతాల నుంచి ప్రపంచ మార్కెట్లకు సజావుగా అనుసంధానం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ అజెండా ప్రకారం అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. నెల్లూరులో రూ.280 కోట్లతో నిర్మించిన షిప్పింగ్ హార్బర్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని గుర్తుచేశారు. గత జగన్ ప్రభుత్వం పోర్ట్‌లు, షిప్పింగ్ హార్బర్‌లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. వాటిని తిరిగి ఇప్పుడు నిర్మాణం చేసే విధంగా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

## మోదీ విజన్, చంద్రబాబు ప్లానింగ్‌తో ఏపీ అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

గజేంద్రసింగ్ షెకావత్ పర్యటించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి అఖండ గోదావరి, సైన్స్ సెంటర్, ఫారెస్ట్ అకాడమీకి శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. చంద్రబాబుని కలిసి పలు ప్రాజెక్ట్‌లపై కూడా చర్చించామని తెలిపారు. ఇరిగేషన్, టూరిజం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పెహల్గాంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని చెప్పారు. పర్యాటకులు స్వేచ్ఛగా అక్కడ ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. మరో పదిహేను రోజుల్లో అక్కడ పర్యాటకుల సందడి మొదలవుతుందని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కీలక వ్యాఖ్యలు చేశారు. '1975 జూన్ 25వ తేదీన భారతదేశంలో అత్యవసర పరిస్థితి విధించబడింది. ఇది ప్రజాస్వామ్యంపై అతిపెద్ద దాడి. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అన్ని ప్రాథమిక హక్కులను కాలరాశారు. పత్రికలపై ఆంక్షలు పెట్టి అరాచకాలు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నారు. లక్షమందికిపైగా అన్యాయంగా అరెస్టులు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చారు. సంజయ్ గాంధీ నియంతలా ప్రజల మీద పడి అరాచకాలకు పాల్పడ్డాడు. ప్రజల ఐక్యపోరాటంతో

### విజయవాడ నగర పరిధిలో

# డ్వాక్రా బజార్ల ఏర్పాటు కృషి : ఎంపీ కేశినేని శివనాథ్

## మెప్మా డిపార్ట్మెంట్ అధికారుల సమావేశంలో ఎంపీ దిశా నిర్దేశం





**అంకుశం న్యూస్ విజయవాడ జూన్ 26:** విజయవాడ నగర పరిధిలో డ్వాక్ర సంఘాలు, అభివృద్ధి కోసం వారు తయారు చేస్తున్న ఉత్పత్తులు మార్కెటింగ్ చేయటం కోసం డ్వాక్రా బజార్లు ఏర్పాటు చేయాలని, తద్వారా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, అప్పుడు మాత్రమే సీఎం చంద్రబాబు నాయుడు ఆశయం ఒక కుటుంబంలో ఒక వ్యాపారవేత్త అభివృద్ధి చెందుతారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ మెప్మా డిపార్ట్మెంట్ అధికార యంత్రాంగంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సంరద్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి అలాగే యువత యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించటం కోసం కుటీర పరిశ్రమల ద్వారా మహిళా సాధికారత సాధించటం కోసం ప్రత్యేకమైన ప్రణాళికలతో పనిచేస్తుందన్నారు. ఎంపీ గా తన నియోజకవర్గంలో ప్రభుత్వం ద్వారా చేస్తున్న కృషితో పాటుగా ప్రత్యేకంగా కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలియజేశారు.

ప్రధానంగా విజయవాడ నగరంలో వున్న దాదాపు పద్నాలుగు వేల డ్వాక్రా గ్రూపులు వారి వారి అవసరాలను బట్టి స్వయం ఉపాధికి కుటీర పరిశ్రమల కామన్ పెసిలిటీ సెంటర్స్ ద్వారా ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. ఇందులో ప్రధానంగా టైలరింగ్, మిల్లెట్స్ ప్రొడక్ట్స్ తయారీ, పేపర్ బ్యాగులు, విస్తారాకులు తయారీకి శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే కామన్ పెసిలిటీ సెంటర్స్ ఉత్పత్తులు తయారు చేసే వారికి మార్కెటింగ్ జరిగే విధంగా ఒకే బ్రాండ్ తో ఉత్పత్తి అమ్మకాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని దానికి అవసరమైన విధంగా ప్రభుత్వ పరంగా, కేశినేని ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మహిళలకు కావాల్సిన వృత్తి నైపుణ్య శిక్షణకు కావాల్సిన ట్రైనింగ్ ను కూడా కామన్ పెసిలిటీ సెంటర్ లో అందించటానికి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మెప్మా పి.వో వెంకట నారాయణ, జిల్లా అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు కె.మీనాక్షి, పాల్గొన్నారు.

# యోగాలో అనంత పోలీసులు ప్రతిభ

**యోగాంధ్ర రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో రెండవ స్థానం సాధించిన విజేతకు జిల్లా ఎస్పీ జగదీష్ ప్రశంసలు**

**విజేతగా నిలిచిన స్థానిక డిటిసి కానిస్టేబుల్ ను అభినందించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూన్ 26:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగ పోటీలలో అనంతపురం జిల్లా పోలీసులు ప్రతిభ చూపించారులి రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఈనెల 17, 18 తేదీలలో "యోగాంధ్ర" రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు నిర్వహించగా... అందులో 35 సంవత్సరాలు పైబడిన విభాగంలో అనంతపురం డిటిసి కానిస్టేబుల్ చలపతి (యోగా శిక్షకుడు)రెండవ స్థానాన్ని సాధించారులి రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీల్లో విజేతలయిన కానిస్టేబుల్ చలపతి మరియు ఇంకొందరు విజేతలను ఈనెల 21 వ తేదీన విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి పంపారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , తదితరులు పాల్గొన్న విశాఖ యోగాంధ్ర కార్యక్రమంలో కానిస్టేబుల్ చలపతి పాల్గొని యోగాసనాలు సాధన చేయడం విశేషంలిఅని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు రాష్ట్ర స్థాయి యోగాంధ్ర యోగాసన పోటీలలో విజేతగా నిలవడంతో పాటు దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన యోగాసనాల సాధనలో అవకాశం దక్కడాన్ని అరుదుగా భావించి కానిస్టేబుల్ చలపతిని అభినందించిన జిల్లా ఎస్పీ జగదీష్ విజేతగా నిలిచిన సమయంలో జారీ చేసిన ప్రశంసా పత్రం, మెమొంటోలను ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛేంబర్లో కానిస్టేబుల్ చలపతికు అందజేసిన జిల్లా ఎస్పీ భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని పోలీస్ శాఖ ప్రతిష్టను యోగాలో పెంచాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు




## జులై 5 న కొత్త చెరువు కు సీఎం చంద్రబాబు

**రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి**

**జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్**





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, జూన్ 26 :**శ్రీ సత్యసాయి జిల్లాలో: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 5వ తేదీన కొత్తచెరువు లో పర్యటించే అవకాశం ఉంది. అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉంది. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని.. జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా... గురువారం కొత్తచెరువు లోని జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజి..లను ఎస్పీ వి.రత్న, జేసి అభిషేక్ కుమార్..లతో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలన్నారు. జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజి..లలోని తరగతి గదులు, ప్రాంగణంలోని మైదానంను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీఈవో కిష్టప్ప, పాఠశాల విద్యాశాఖ జేడీ సుబ్బారావు, ఎస్ ఎస్ ఏ పీవో దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ.......




**అంకుశం న్యూస్, ధర్మవరం జూన్ 26:** గురువారం ధర్మవరం లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణం లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ సిబ్బంది, ఎక్సైజ్, స్థానిక పోలీస్ శాఖ, న్యాయసేవాధికార సంస్థ, ఐ సిడి ఎస్ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మూలారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 26:** అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో మూలారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణ మిషన్ లైన్స్ నేత్ర వైద్యశాల నిడదవోలు వారు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఎన్డీఏ కూటమి నాయకులు పంచాయతీ కార్యాలయంలో నేత్ర వైద్యులు డాక్టర్ సిహెచ్ నాగరాజు, పడాల చంటి రెడ్డి, సత్తి సుబ్బారెడ్డి ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 105 మంది నేత్ర పరీక్షలు చేసి వైద్య సలహాలు సూచనలు చేసినట్టు డాక్టర్ నాగరాజుతెలిపారు. 18 మందికి కంటిఆపరేషన్లు జరపాలని తెలిపారు. వీరందరికీ ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. 25 మందికి నేత్ర పరీక్షలు జరిపి కళ్ళజోడు అవసరమని తెలిపారు. డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రావణి నేతృత్వంలోని ఎల్ఈడి బోర్డు, విజన్ బోర్డ్స్, ఏ ఆర్ మిషన్, ఫ్రైబ్ బాక్సులు కంప్యూటర్లలో కంటి పరీక్షలు నిర్వహించారు. నిడదవోలు తమ ఆసుపత్రి నందు అత్యధిక విదేశీ పరికరాలతో అనుభవజ్ఞులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దృష్టి దోషం గల వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అతి తక్కువ ధరలో కళ్ళజోళ్ళు వేస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీ మరియు తెల్ల రాసిన కార్డు గలవారికి కుట్లు లేని కంటి ఆపరేషన్లు పికోమిషన్ ద్వారా నిడదవోలు తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మోహన్ మరియు నవీన్ లతోపాటు మహేంద్రవాడ ఎన్డీఏ కూటమి నాయకులు, వెలగల నారాయణరెడ్డి, పడాల రామారెడ్డి, సతీష్,సీతారామరెడ్డి, కోనాల వెంకటరెడ్డి, మల్లేటి సత్యనారాయణ రెడ్డి ( అన్నరంగారిబుజ్జి) అమ్మి రాజు, సబ్బెళ్ల రామారెడ్డి, జి ఆర్ కే రెడ్డి, గోవిందుతదితరులు పాల్గొన్నారు

## వైయస్ఆర్ సిపి రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీగా రావు నియామకం



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 26:** రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీగా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన నాగమల్ల వీరభద్రరావు(రావు) ను పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి నియమించారు. నాగమళ్ళ వీరభద్రరావును అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

## అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్ శంకుస్థాపన లో పాల్గొన్న కేంద్ర మంత్రిగజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కలిసి పాల్గొన్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 26:** రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద 94.44కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ కేంద్ర మంత్రివర్యులు శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్,డిప్యూటీ సీఎం శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ తో కలిసి పాల్గొన్న అనపర్తి శాసనసభ్యులు శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,రాజమండ్రి ఎంపీ,బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర టూరిజం మినిస్టర్ శ్రీ కందుల దుర్గేష్,రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామనాయుడు, ఎమ్మెల్సీ శ్రీ సోము వీర్రాజు, తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీ పిక్కి నాగేంద్ర, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, కూటమి నాయకులు.

## ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేపట్టాలి





**- : 30వ తేదీ లోపల ఈ ప్రక్రియ పూర్తి చేయాలి**

**- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**- : అనంతపురం రూరల్ లోని కామారుపల్లిలో 65 సంవత్సరాలు పైబడిన వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్..**

**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 26 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో- 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. గురువారం అనంతపురం రూరల్ మండలంలోని కామారుపల్లి గ్రామంలో 65 సంవత్సరాలు పైబడిన వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని, కార్డుదారురాలికి రేషన్ సరుకులను జిల్లా కలెక్టర్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీలోపల 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే ప్రకియను పూర్తి చేయాలని ఆదేశించారు. 65 సంవత్సరాల పైబడిన వారు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారు ఎవరు కూడా ఎఫ్.పి షాపు వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. ఎవరికి సంబంధించిన వారి బియ్యం, చక్కెరలాంటి రేషన్ సరుకులు వారి ఇంటి వద్దకే వెళ్లి చేర్చాలన్నారు. ఈ సందర్భంగా 65 సంవత్సరాల పైబడి ఉంది కాబట్టి మీరు షాపుకు వెళ్లాల్సిన అవసరం లేదు, ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇస్తారు, ఈ విషయం మీకు తెలియజేశారా అంటూ రేషన్ కార్డుదారురాలు నారాయణమ్మను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బియ్యం నాణ్యత బాగుందా, బియ్యంతో ఏం చేస్తారు? అన్నం వండుకుంటారా, అంటూ పలు వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చే 2.5 కిలోమీటర్ల రోడ్డును 16 లక్షల రూపాయలతో డిఎంఎఫ్ ఫండ్స్ కింద మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మోహన్ రావు, ఎఫ్.పి షాపు డీలర్ యమున, విఆర్ఓ రామకృష్ణ, ఆర్ఐ సందీప్, పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీటిని కాపాడుకోవడమే మన లక్ష్యం కావాలి

## ఆర్డీటి పరిరక్షణ జేఏసీ కన్వీనర్ గా సాకే హరి ఏకగ్రీవం





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 26:** అనంతపురం జిల్లాలో గత 55 సంవత్సరాలకు పైగా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ అన్ని వర్గాల ప్రజలకు విద్య వైద్య క్రీడలు రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పేద ప్రజల కల్పతరువు ఆర్డీటిను కాపాడుకోవడమే మన లక్ష్యం కావాలని ఆర్డీటి పరిరక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి అన్నారు. గురువారం అనంతపురం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఆర్డీటి పర్యవేక్షణ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కుల,ప్రజా సంఘాలు దివ్యాంగులు కలిసి ఆర్డీటి జిల్లా నుండి తరలిపోతే ఎంతో లోటన్న అంశంపై చర్చించారు. ఇప్పటికే నాలుగు లక్షల 71,200 మంది ప్రత్యక్షంగా లబ్ధి పొందారని లక్ష దాకా గృహాలు నిర్మించుకోగా వ్యవసాయ,ఉపాధి,క్రీడా రంగాలలో ఆర్డీటి చేసిన సేవలు అమోఘమన్నారు. నిరంతరం పేద ప్రజల మన్ననలు పొందుతున్న ఫాదర్ విన్సెంట్ పెర్రర్ స్థాపించిన ఆర్డీటికి కేంద్రంలో ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ కాకుండా అడ్డుకోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వ పరిపాలనకు ప్రత్యామ్నాయంగా విద్య,వైద్య రంగాలలో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పేదలకు సాయం చేసిందన్నారు. ఘన చరిత్ర కలిగిన ఆర్డీటిని కాపాడుకోవడానికి కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలు చేయడానికి ముందుకు రావాలన్నారు.

### ఆర్డీటి పరిరక్షణ జేఏసీ కన్వీనర్ గా ఏకగ్రీవంగా సాకే హరి ఎన్నిక

నూతన కన్వీనర్ సాకే హరి మాట్లాడుతూ.. అనంతపురం ఉమ్మడి జిల్లాల పేద ప్రజలు ఫాదర్ విన్సెంట్ పెర్రర్

ఎప్పుడు రుణ పడి ఉంటారన్నారు. కానరాని దేశాల్లో జన్మించిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అనంతపూర్ జిల్లా అభివృద్ధి,చైతన్యం, మార్పు కోసం చివరివరకు తపించారని ఆయన ఆశయాలు నెరవేర్చడంలో భాగస్వాములౌదామన్నారు. తక్షణం ఆర్డీటికి కేంద్రం ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ కోసం పోరాటాలు చేయాలన్నారు. అందులో భాగంగా మొదటి దశగా ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు ఎంపీలకు సేవ్ ఆర్డీటి వినతి పత్రాలు అందజేయడానికి ఐక్యం కావాలన్నారు. తర్వాత పలు విధాల రూపాలలో ఆర్డీటి ఎఫ్ సి ఆర్ ఎ జరిగేంతవరకు కలిసికట్టు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో వివిధ కుల ప్రజా సంఘాల నాయకులు పాల్తూరు ఆనందరాజు, చామలూరు రాజగోపాల్, ఓబులేసు, సుగమంచి శ్రీనివాసులు,చాబాల జగదీష్,మందల రమేష్, బుడగ జంగం అంజి,టి పి రామన్న, మారెన్న, వసంత కుమార్, రాజేష్, రామాంజనేయులు, మిద్దె ఓబులేష్, దండు వారి పల్లి రాజు, రామకృష్ణ, రాకెట్ల సూర్యనారాయణ, నరేంద్ర, లాలెప్ప, అదాం, లక్ష్మయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

# స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి






**రుణం తీసుకున్న ప్రతి మహిళ క్రమం తప్పకుండా చెల్లించాలి**

**స్త్రీ నిధి రుణాల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత**

**సంక్షేమ పథకాలపై ఎగతాళి చేసిన నోళ్లు ఇప్పుడు మూసుకుంటున్నాయి**

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 26:** కూటమి ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి రుణాలను ప్రతి ఒక్క సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. చెన్నేకొత్తపల్లి మండలకేంద్రంలో స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని 198మహిళా స్వయం సహాయక సంఘాలలోని 441మంది సభ్యులకు 4.38కోట్ల స్త్రీనిధి ఋణాలు పంపిణీ చేశారు. మహిళలతో మాట్లాడి రుణాల ద్వారా ఎలా ఉపాధి పొందుతున్నారన్నది ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు మహిళలు కనీసం ఇంటి అవసరాలకు కూడా... తమ భర్తల మీద ఆధారపడేవారని అయితే ఇప్పుడు వారే ఆర్థిక అభివృద్ధి సాధించి భర్తలు కూడా వారిపై ఆధారపడే స్థాయికి వచ్చారన్నారు. దీనికి ప్రధానమైన కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. ఆయన ఆరోజు డ్వాక్రా సంఘాలు తీసుకురావడం వల్లే మహిళలు... స్వయం ఉపాధితోపాటు వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నారన్నారు. తమ పిల్లలను కూడా ఉన్నత చదువులు చదివించుకుంటున్నారన్నారు. ప్రస్తుతం రుణాలు పొందిన మహిళలు... వాటిని ఇంటి అవసరాలకు కాకుండా.. ఏదైనా వ్యాపారానికి లేదా ఉపాధి పొందే విధంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మీరు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోకపోతే తిరిగి చెల్లించడం కూడా కష్టమవుతుందన్నారు. ప్రతి మహిళ తీసుకున్న రుణానికి క్రమం తప్పకుండా కంతులు చెల్లించాలని సూచించారు. మహిళలకు ఈ ప్రభుత్వం ఎన్నో రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తోందని ఎమ్మెల్యే సునీత అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న అందరికీ 15వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ పథకం ఇంకా ఎవరికైనా రాకపోతే.. అందుకు గల కారణాలు కనుక్కోవాల్సిన బాధ్యత టిడిపి నాయకులు తీసుకోవాలన్నారు. వాటిని అధికారులు దృష్టికి తీసుకెళ్లి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చూడాలన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. నిన్నటి వరకు నీకు 15 వేలు, 15వేలు అని ఎగతాళి చేసిన వారి నోళ్లు ఇప్పుడు మూసుకుంటున్నాయన్నారు. ఎవరైనా ఇంకా దీని గురించి మాట్లాడితే మహిళలు నిలదీయాలన్నారు. మహిళలు తమ పిల్లల మీద ప్రత్యేకంగా దృష్టి సారించాలని... వారు చదివే చదువు, వారి ప్రవర్తన, కదలికల గురించి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.....

## మండపేట టౌన్ పోలీసు ల ఆధ్వర్యంలో

# మాదక ద్రవ్యాల అవగాహన సదస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ల






**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 26:** మాదక ద్రవ్యాల వ్యసనం విద్యార్థుల బంగారు జీవితాలను చీకటిమయం చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట టౌన్ పోలీసు ల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ ని ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కొన్ని మాదక ద్రవ్యాలను కొందరు విద్యార్థులు సరదాగా అనుకుని మొదలు పెట్టీ ఆపై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఒకసారి వీటికి అలవాటు పడితే ఇక వారు జీవితంలో కోలుకోలేరన్నారు. వీటి బారిన పడిన వారు డబ్బు కోసం నేరాలు చేసే స్థాయికి సైతం దిగజారిపోతారని, వీటి పట్ల విద్యార్థులు, ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డల అలవాట్లను గమనించుకోవాలన్నారు. మందు, గంజాయి వంటి ప్రమాదకర అలవాట్లు దరిచేరకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో వేలాదిమంది విద్యార్థులతో ర్యాలీ సందడిగా మారింది. మండపేట టౌన్ సీఐ డి.సురేష్ పర్యవేక్షణలో టౌన్ ఎస్.ఐ చంటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండపేట మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో ర్యాంకులుసాధించిన

## జిబిఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపల్

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 26:** ఏపీ పీజీ సెట్ 2025 ప్రకటించిన ఫలితాలలో జిబిఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినారు పి వై ఎస్ ఆదిలక్ష్మి శైలజవాణి 59 వ ర్యాంకు టి రక్షిత విహారిక 73వ ర్యాంకు వి వి సతీష్ 783 వ ర్యాంకు కే శిరీష 990 ర్యాంకు సాయి 1275 టి శిరీష 3527వ కెమికల్ సైన్స్ విభాగంలో ర్యాంకులు సాధించినారు ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి కొండబాబు కళాశాల డైరెక్టర్లు బి రత్నారెడ్డి, కే హరినాధరెడ్డి, డివిఆర్ఏ పాపిరెడ్డి ,డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు కే రామకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి ఆర్ ఎల్ స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ పి అబ్బాయి రెడ్డి అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి సిహెచ్ ఆనందరావు వీరికి అభినందనలు తెలియజేసినారు



## పేద కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.20 వేలు ఆర్థిక సహాయం



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 26:** కష్టకాలంలో ఉన్న ఒక కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆపన్న హస్తం అందించి అండగా నిలిచారు. ఆ నిరుపేద కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించి మీకు తోడుగా నేనున్న అంటూ భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామానికి చెందిన చవకల సతీష్ ఇటీవల కాలం చేశారు. ఆయన మరణంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి గురువారం సాయంత్రం మృతుడు సతీష్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 20 వేల రూపాయలు చెక్కు ద్వారా ఆర్థిక సహాయం చేసి మనో ధైర్యం కల్పించారు. కష్టకాలంలో, ఆపద సమయాల్లో ఉన్న నిరుపేదల కుటుంబాల పట్ల మానవత్వాన్ని, తన సేవా నిరతిని మంత్రి వాసంశెట్టి సుభాష్ చాటుకుంటూనే ఉన్నారు. కష్టంలో ఉన్న తమకు సాయం చేసిన మంత్రి సుభాష్ కు కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## నాటు సారాయిపై విస్తృతంగా దాడులు నిర్వహించండి..

## ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 26:** పట్టణ గ్రామీణ ప్రాంతాలలో నాటు సారాయిపై అధికంగా దాడులు నిర్వహించాలని తద్వారా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ ను స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను కూడా వారు పరిశీలించారు. నేడు నాటు సారా విక్రయాల వలన ఎంతోమంది కుటుంబాలను నష్టపోతు మృత్యుపాలు అవుతున్నారని, చట్ట ప్రకారం నాటు సారాయిని తుది ముట్టించాలని వారు ఆదేశించారు. అదేవిధంగా మద్యమును చట్ట ప్రకారమే విక్రయాలు జరగాలని, వేరే రకంగా జరిగితే కఠిన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. బ్రాందీ షాపులలో మైనర్ వాళ్లకు సరుకు అమ్మ రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రమణి, సబ్ ఇన్స్పెక్టర్ చాంద్బాషా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ నుండి యువతి, యువకులను కాపాడుకోవాలి.. స్పందన హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 26:** డ్రగ్స్ నుండి యువతి యువకులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిమీద ఉందని స్పందన హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో"డ్రగ్స్ కు సంబంధించిన యువతను కాపాడుకోవడం ఎలా?"అన్న కరపత్రాలను డీఎస్పీ హేమంత్ కుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. అనంతరం డాక్టర్ బషీర్ మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై భవిష్యత్తును నేడు సమాజంలో నాశనం చేసుకుంటుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం దూర ప్రాంతాలలో కార్పొరేట్ కళాశాలలో, పాఠశాలల్లో డబ్బులు చెల్లించి చదివిస్తున్నారు. కానీ కొన్నిచోట్ల మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను బొగ్గు పాలు చేసుకుంటున్నారని తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేటి యువతీ యువకులు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను గుర్తుపెట్టుకొని ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడాలని తెలిపారు. తదుపరి డ్రగ్స్ అలవాటు పై ఆందోళన ఎందుకు?, అడిక్షన్ గుర్తించడం ఎలా?, దారి తీసే పరిస్థితులు ఏవి?, విముక్తి పొందడం ఎలా?, సమాజములో మనందరి బాధ్యతలు ఏమి అన్న వాటిని వారు వివరంగా తెలియజేశారు. డ్రగ్స్ అలవాటు పడిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారిని మార్చే ప్రయత్నం చేయాలి అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా డ్రగ్స్ నియంత్రణపై ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం డిఎస్పి హేమంత్ కుమార్ మాట్లాడుతూ అనుకోకుండా అలవాటయ్యే డ్రగ్స్ వల్ల యువతి యువకుల భవిష్యత్తు అంధకారమవుతోందని తెలిపారు. కుటుంబంలోని కొంతమంది పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడి తల్లిదండ్రులకు తీవ్ర మనస్థాపానికి గురిచేస్తుందన్నారు. ముఖ్యంగా 15- 24 సంవత్సరాలలోపు యువతనే టార్గెట్ చేస్తూ నగరాలలో పట్టణాలలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని తెలిపారు. తప్పనిసరిగా యువతి యువకులు తమ భవిష్యత్తును కాపాడుకోవడానికి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన హాస్పిటల్ డాక్టర్ రుతిక్, మేనేజర్ బాబా ఫక్రుద్దీన్, దిల్దార్ తదితరులు పాల్గొన్నారు.